26 JUN 2020
SAKSHI

# గుండె గుబిల్

- వినియోగదారులపై విద్యుత్తు చార్జీల భారం
- మూడు నెలలు రీడింగ్ నమోదు చేయక అధికమైన చార్జీలు
- ఒకేసారి మొత్తం చెల్లించమంటున్నారని వినియోగదారుల గగ్గోలు

యానాం: యానాంలో 2020-2021 ఆర్థిక సంవత్సరంలో విద్యుత్తు చార్జీలు పెంచుతూ జాయింట్ ఎలక్ట్రిసిటీ రెగ్యులేటరీ కమిషన్(జేఈఆర్‌సీ) ఇప్పటికే నిర్ణయం తీసుకోవడంతో దాని ప్రభావం వినియోగదారులపై పడి వారు బెంబేలెత్తిపోతున్నారు. ముఖ్యంగా అన్ని కేటగిరీలపై 3.2 శాతం పెంచగా, మళ్లీ సర్‌చార్జ్ సైతం నాలుగు శాతం పెంచింది. అది ఇంకా అమలు రాకముందే గృహ వినియోగదారులకు, వాణిజ్య అవసరాలకు, పరిశ్రమలకు, హెచ్‌టీ వినియోగదారులకు లాక్‌డౌన్ నేపథ్యంలో మూడునెలల పాటు వినియోగించిన బిల్లులు అందరినీ భయపెడుతున్నాయి.

గృహవినియోగదారులకు నెలకు రూ.600 వచ్చే బిల్లు కాస్తా ఈ నెల రూ.నాలుగు వేల దాకా రావడంతో వారంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. దీనికి తోడు మూడు నెలల బిల్లులు ఒకేసారి చెల్లించమనడంతో ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒక స్వీట్ షాపు యజమానికైతే రూ.45 వేలు బిల్లు రావడంతో అవాక్కవుతున్నారు.

విద్యుత్తు సిబ్బంది మూడు నెలలపాటు రీడింగ్ తీసుకోకపోవడం, ఒకేసారి మార్చి, ఏప్రిల్, మే మూడు నెలల రీడింగ్ తీసుకోవడంతో శ్లాబు పెరిగి బిల్లులు వేలల్లో వచ్చాయని పలువురు వినియోగదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు, వైద్య, పారిశుధ్య సిబ్బంది లాక్‌డౌన్ వేళల్లో వారి సేవలు అందించినా విద్యుత్ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి మీటర్ రీడింగ్ నోట్ చేయలేదని వారు అన్నారు. అయినా పలువురు వినియోగదారులు బిల్లులు చెల్లించారని, డోర్‌లాక్ అని రాసి రూ.450 అదనంగా ఫైన్ కట్టించుకున్నారన్నారు. ఒకే సారి మూడు నెలల బిల్లు రావడంతో పాటు లాక్‌డౌన్ కావడంతో ఇంట్లోనే ఉంటూ నిత్యం కరెంటు వినియోగం జరిగిందని పగలూ, రాత్రి వినియోగించడంతో శ్లాబ్ రేటు పెరిగిందన్నారు. మే 27న వచ్చి రీడింగ్‌లు నమోదు చేశారని అనంతరం బిల్లులు ఇచ్చారన్నారు.



యానాం విద్యుత్తు శాఖ కార్యాలయం



విద్యుత్తు ఫీజులు చెల్లించడానికి వచ్చిన వినియోగదారులు

### నిబంధనల ప్రకారమే..

లాక్‌డౌన్ నేపథ్యంలో రీడింగ్ తీసుకోకపోవడం, విద్యుత్తు ఎక్కువగా వినియోగించడం వల్లే చార్జీలు పెరిగాయి. అయినా రీడింగ్‌ను మూడు నెలలుగా విభజించడంతో శ్లాబు రేటు తగ్గుతుంది. నిబంధనల ప్రకారమే చార్జీలు వసూలు.

-టి.రాఘవులు, ఈఈ,
విద్యుత్తు శాఖ

### మీటర్లు బయటే ఉండగా డోర్‌లాక్ ఫైన్

యానాంలో దాదాపు అందరి గృహవినియోగదారుల మీటర్లు ఇంటి బయటే ఏర్పాటు చేసుకున్నారని ఈ నేపథ్యంలో డోర్‌లాక్ ఫైన్ విధించడమేంటని? పలువురు ప్రశ్నించారు. డోర్‌లాక్ ఫైన్‌ను తదుపరి బిల్లుల్లో సర్దుబాటు చేయాలన్నారు.

### మూడునెలల పాటు బిల్లులు ఒకేసారి...

మూడునెలల బిల్లులు ఒకేసారి రావడంతో వచ్చిన రీడింగ్‌ను మూడుతో భాగించి అనంతరం వచ్చిన మొత్తాన్ని మళ్లీ మూడుతో గుణిస్తున్నారని ఆవిధంగా శ్లాబురేటు తగ్గి మొత్తం చార్జీ సైతం తగ్గుతుందని విద్యుత్‌సిబ్బంది చెబుతున్నారు.

## 'అందరికీ వైద్యసేవలు అందిస్తున్నాం'

యానాం: ఆంధ్రా, యానాం అని సంబంధం లేకుండా అందరికి వైద్యసేవలు అందిస్తున్నామని పరిపాలనాధికారి శివరాజ్‌మీనా స్పష్టం చేశారు. గురువారం ఆయన మాట్లాడుతూ యానాం సరిహద్దు ఏపీలోని సరిహద్దు మండలాల నుంచి యానాం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రికి వచ్చే రోగులకు వైద్యసేవలు నిలుపుదల చేశామనే విషయంలో వాస్తవం లేదన్నారు. మార్చి , ఏప్రిల్, మే, జూన్ నెలల్లో డెలివరీల కేసులను వైద్యసిబ్బంది నిర్వహించారన్నారు. యానాం జీజీహెచ్ ద్వారా అందరికి మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో కృషిచేస్తున్నట్లు తెలిపారు. అందరూ వైద్యసేవలను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

## గ్రామాల్లో మొబైల్ యూనిట్ల ద్వారా వైద్య పరీక్షలు

యానాం: కరోనా వ్యాధిగ్రస్థులు పెరుగుతున్న నేపథ్యంలో పుదుచ్చేరి వ్యాప్తంగా మొబైల్ యూనిట్ల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లోకి సైతం వెళ్లి వైద్య పరీక్షలు నిర్వహించనున్నట్లు పుదుచ్చేరి ఆరోగ్య శాఖా మంత్రి మల్లాడి కృష్ణారావు తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముఖ్యంగా కంటైన్‌మెంట్‌జోన్లు, క్లస్టర్‌ల్లో కరోనా స్వాబ్ పరీక్షలు చేయడానికి దృష్టిని కేంద్రీకరిస్తున్నట్లు తెలిపారు. శుక్రవారం నుంచి యానాం, కారైకల్, మాహేలలో సైతం ప్రారంభించనున్నట్లు తెలిపారు. గురువారం ఒక్కరోజే పుదుచ్చేరిలో 59 కొత్తగా పాజిటివ్ కేసులు నమోదయ్యాయని అన్నారు. హెల్త్‌డైరెక్టర్ ఎస్.మోహన్‌కుమార్ మాట్లాడుతూ ప్రస్తుతం పుదుచ్చేరివ్యాప్తంగా 276 మంది చికిత్సపొందుతున్నారని అందులో ఇందిరా గాంధీ ఆసుపత్రిలో 173, జిప్‌మెర్‌లో 89, కారైకల్‌లో 11, యానాం, మాహే, కడలూరు జిజిహెచ్‌ల్లో ఒకరు చొప్పున చికిత్సపొందుతుండగా ఇప్పటికే 11మంది డిశ్చార్జి అయినట్లు తెలిపారు.

PRAJA SAKTHI
26 JUN 2020

## కరోనా కట్టడికి అవగాహనా కమిటీలు

యానాం : నియోజకవర్గంలోని కరోనా వైరస్ కట్టడి చర్యల్లో భాగంగా ప్రజలకు అవగాహన కల్పించేందుకు ప్రాంతాలవారీగా నియోజవర్గంలో 16 కమిటీలను ఏర్పాటు చేయనున్నట్లు ప్రాంతీయ పరిపాలనాధికారి శివరాజ్ మీనా తెలిపారు. గురువారం ఆయన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. కొంత మంది యానాం చుట్టుపక్కల ఉన్న రెడ్‌జోన్లకు రహస్యంగా వెళ్లి వస్తున్నట్టు తెలిసిందన్నారు. అలాంటి వారిని కనుగొని వారికి అవగాహన కల్పించేందుకు కమిటీలు ఏర్పాటు చేశామన్నారు.

26 JUN 2020 VELUGU

### ప్రభుత్వ ఆదాయం కన్నా

# ప్రజల ఆరోగ్యమే ముఖ్యం

### -ఆరోగ్యశాఖా మంత్రి మల్లాడి



యానాం, జూన్25(వెలుగు విలేకరి): ఆదాయం కన్నా ప్రజల ఆరోగ్యం ముఖ్యమని పుదుచ్చేరి ఆరోగ్య శాఖ మంత్రి మల్లాడి కృష్ణారావు పేర్కొన్నారు. గురువారం పుదుచ్చేరిలోని మంత్రి కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం కొరకు లాకడౌన్ నిబంధనలు పుదుచ్చేరి నాలుగు ప్రాంతాలలో కఠినముగా నిర్వహిస్తున్నామని, లాక్ డౌన్ వలన ప్రభుత్వ ఆదాయం పూర్తిగా తగ్గిపోయిందని, అయినప్పటికి ఉద్యోగస్తులకు కోత లేకుండా జీతాలు చెల్లిస్తున్నామన్నారు. కరోనా నివారణ కోసం ఐజిఎమ్ ఆసుపత్రి, జిప్మర్ ఆసుపత్రి తదితర ఆసుపత్రులలో వైరస్ సోకిన పేషెంట్లు కొరకు ఐసోలేషన్ వార్డులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం 306 మంది వైరస్ సోకి ఆయా ఆసుపత్రులలో చికిత్స పొందుతున్నారని తెలిపారు. ఎప్పటి వరకు 13,861 మందికి నిర్ధారణ పరీక్షలు చేశామన్నారు. రాష్ట్రంలో రోజుకి కొత్తగా 40 కేసులు నమోదవుతున్నాయని, ఇవి ఇంకా పెరిగే అవకాశం ఉందన్నారు. జూలై మొదటి వారంలో అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఉన్నాయని ఈ సమావేశాల్లో వైద్య శాఖకి సంబంధించి మెడిసిన్, వైద్య పరికరాలు, వైరస్ నివారణకి సంబంధించి అనేక పరికరాలు తదితర వాటి కొరకు ప్రత్యేక నిధులు కేటాయించే విధంగా ఈ సమావేశాల్లో బిల్లు పెడుతున్నట్లు తెలిపారు. వచ్చే వారంలో కారైకాల్, మాహే వెళ్లి ఆ ప్రాంతాలలో వైరస్ నివారణ కొరకు తీసుకుంటున్న చర్యలను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. హోటల్స్‌లో పార్సిల్ సెక్షన్ రద్దు చేసేందుకు నిర్ణయం తీసుకోనున్నట్లు తెలిపారు. కరోనా వైరస్ నివారణ కొరకు ఎన్ని చర్యలు తీసుకున్నప్పటికి ప్రజల సహకారం ఉంటేనే నివారణ సాధ్యం అవుతుందన్నారు.

ANDHRA JYOTHI
26 JUN 2020

## కొవిడ్ నిబంధనలు అతిక్రమిస్తే పదేళ్ల జైలు: పరిపాలనాధికారి శివరాజ్‌మీనా

యానాం, జూన్ 25: కొవిడ్ నిబంధనలు అతిక్రమిస్తే పదేళ్ల జైలుశిక్ష విధించనున్నట్టు యానాం పరిపాలనాధికారి శివరాజ్‌మీనా తెలిపారు. కరోనా నియంత్రణలో భాగంగా యానాంను 16జోన్‌లుగా విభజించి ప్రత్యేక చర్యలు తీసుకోనున్నట్టు చెప్పారు. ఆయన గురువారం వివరాలను వెల్లడించారు. 16జోన్లలో 16టీమ్‌లను నియమించామన్నారు. వీరిలో ఉపాధ్యాయలు, ఆశా, అంగన్‌వాడీ, ఏఎన్ఎమ్‌లతో పాటు వలంటీర్లు ఉంటారన్నారు. సర్వే ఆధారంగా ఉపాధి నిమిత్తం బయటకు వెళ్లే వారి వివరాలు నమోదు చేసుకుని పాస్‌లు ఇస్తామన్నారు. యానాంలో తిరిగే వారిని గ్రీన్‌హౌస్‌గాను, యానాం నుంచిఇతర ప్రాంతాలకు వెళ్లే వారి ఇంటిని రెడ్, ఆరెంజ్ హౌస్‌గాను పరిగణిస్తామని తెలిపారు.

ENADU
26 JUN 2020

## గ్రామాల్లో కరోనా నిర్ధారిత పరీక్షలు

యానాం, న్యూస్‌టుడే: కరోనా వైరస్ వ్యాప్తి చెందుతున్న నేపథ్యంలో రోజువారీగా నిర్వహించే పరీక్షల సంఖ్యను పుదుచ్చేరి వ్యాప్తంగా పెంచనున్నట్లు ఆరోగ్యశాఖామంత్రి మల్లాడి కృష్ణారావు తెలిపారు.

యానాం: మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని యానాం ఎస్పీ ఆర్. భక్తవత్సలన్, సీఐ గూటం శివగణేష్ పేర్కొన్నారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడారు. శుక్రవారం అంతర్జాతీయ మాదక ద్రవ్యాల నివారణ దినోత్సవాన్ని నిర్వహించనున్నట్లు చెప్పారు.